జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 31 | అక్టోబర్ | 2026 | పేజీలు : 10

భూ రీ సర్వే పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ అంకిత్

- విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం సహించేది లేదు
- గుండాల ఏకలవ్య పాఠశాలలో లోపాలపై తీవ్ర అసంతృప్తి, వైస్ ప్రిన్సిపల్ కు శోకాస్ నోటీస్, వంట మనిషిని తొలగించాలని ఆదేశం
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి మందులు వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలి

2 లో

ఏజెన్సీలో ఐరెన్ షాపుల దందా..!

- ఆ దుకాణాలపై తూనికలు, బిల్లులపై తనిఖీ ఎప్పుడు..?
- జీఎస్టీ బిల్లుకు బదులు చీటీలు..? వినియోగదారుడి జేబుకు చిల్లు.. పన్నుల శాఖ ఏం చేస్తోంది..?
- టన్నుకు క్వింటా మాయం..? కాంటాలో మోసం..? తూనికల శాఖ నిద్ర మేల్కొనేదెప్పుడు..?
- ఐఎస్ఐ ముద్ర లేని స్టీల్..? డేట్ దాటిన సిమెంట్..? ప్రజల ప్రాణాలతో చెలగాటమా..?
- ఫైర్ ఎన్ఓసీ లేకుండానే భారీ గోడౌన్లు..? ప్రమాదం జరిగితే బాధ్యులెవరు..? జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలి..!

మణుగూరు మార్కెట్ లో ఇనుము, స్టీల్, సిమెంట్ దుకాణాల నిర్వహణ పై తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. టన్నుల కొద్దీ సరుకు విక్రయిస్తున్నా కాంటాలకు తూనికల శాఖ ముద్ర ఉందా..? జీఎస్టీ బిల్లుకు బదులు చేతిరాత చీటీలతోనే దందా నడుస్తోందా..? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఐఎస్ఐ ముద్ర లేని స్టీల్, గడువు దాటిన సిమెంట్ బస్తాలతో నిర్మాణాలు చేపడితే ప్రజల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారీ గోడౌన్లకు ఫైర్ ఎన్ఓసి, మున్సిపల్, పంచాయతీ ట్రేడ్ లైసెన్స్, షాప్ లైసెన్స్ ఉన్నాయా అనేది కూడా తేలాల్సి ఉంది. ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదనే ప్రశ్నకు సమాధానం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని అన్ని శాఖలతో సంయుక్త తనిఖీలు చేపట్టాలని, నివేదికను బహిరంగపరచాలని స్థానికులు, వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

10 లో

పిట్టల్లా రాలుతున్న చాపలమార్కెట్ వాసులు..!

- ఆ ప్రాంతానికి పట్టిన మాయదారి కీడు శాపం..! - 3 రోజుల్లో 5 శవాలు.. ఒకే ఇంట్లో 4 మరణాలు..!
- మణుగూరు చాపల మార్కెట్ లో నరకం చూస్తున్న జనం..!
- స్కూల్ కు వెళ్లాలంటే పిల్లలకు భయం.. పనికి పోవాలంటే పెద్దలకు భయం.. బస్తీకి రావాలంటేనే వణుకుతున్న జనం..!
- బస్తిలో మురికి కాలువలు... పట్టించుకోని మున్సిపాలిటీ... కమిషనర్ ఉన్నారా..? లేరా..? అంటున్న జనం..!
- ఓట్లప్పుడు వస్తారు.. చావులప్పుడు రారు.. ఎమ్మెల్యే పాయం ఎక్కడ..? అడుగుతున్న జనం...
- బొడ్డురాయి వేయకపోతే ఊరే ఖాళీ.. దిక్కు చూడని నాయకులు.. దేవుడే దిక్కంటున్న బస్తీ వాసులు..!
- చాపల మార్కెట్ కు కీడు వచ్చింది.. ఎమ్మెల్యే గారూ.. ఒక్కసారి వచ్చి చూడండి.. మా ప్రాణాలు కాపాడండి..!
- మా సమస్యకు స్పందించి కథనం రాసిన విలేకరికి, 'ప్రజాజ్యోతి' యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపిన బస్తీ వాసులు...

7 లో

అమరవీరుల స్ఫూర్తితో రక్షకభటుల రక్తదానం..!

- ఖాకీల్లో కరుణ.. వందమంది యువతతో రక్తదాన శిబిరం..!
- కిన్నెర కళ్యాణమండపంలో రక్తదాన సంద్రం..!
- ప్రాణం పోయడంలోనూ ముందున్న పోలీసులు..
- సబ్ డివిజన్ డీఎస్పీ రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా రక్తదానం ప్రోగ్రాం...
- తుపాకీ పట్టే చేతులే ఇవాళ సూదిని పట్టుకున్నాయి.
- నెత్తురు చిందించిన ఖాకీలే ఇవాళ నెత్తురు పంచాయి. దేశం కోసం ప్రాణం ఇచ్చిన తమ అన్నల ఆత్మశాంతి కోసం, మణుగూరు ఖాకీలు తమ దేహంలోని రక్తాన్ని ధారపోశారు.
- ఇది శిబిరం కాదు, అమరవీరులకు ఖాకీ బిడ్డలు ఇచ్చిన రక్తాభిషేకం.
- కిన్నెర కళ్యాణ మండపం సాక్షిగా ఆ రక్షకభటులు చూపిన ఈ మానవత్వానికి వందనం.. వందనం..!

10లో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. అక్టోబర్ 30, ప్రజాజ్యోతి...

ఖాకీ అంటే కేవలం కఠినత్వం కాదు, ఖాకీ వెనుక కరుణ కూడా ఉంటుందని మణుగూరు పోలీసులు మరోసారి నిరూపించారు. అమరవీరుల వారోత్సవాల సందర్భంగా తమ ప్రాణాలను త్యాగం చేసిన...

భూ రీ సర్వే పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ అంకిత్

- విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం సహించేది లేదు
- గుండాల ఏకలవ్య పాఠశాలలో లోపాలపై తీవ్ర అసంతృప్తి, వైస్ ప్రిన్సిపల్ కు శోకాస్ నోటీస్, వంట మనిషిని తొలగించాలని ఆదేశం
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి మందులు వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలి

గుండాల అక్టోబర్ 30 ప్రజా జ్యోతి : రైతుల సమక్షంలోనే భూముల హద్దులను నిర్ధారించాలని, జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. శుక్రవారం గుండాల మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. మండలంలోని పోతిరెడ్డిగూడెం గ్రామంలో భూ రీ సర్వే పనులను పరిశీలించి, భూ సర్వే పనులను వేగవంతం చేయాలని కోరారు. భూ రీ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ సర్వే పురోగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతుల పేర్లు, సంతకాలు, ఆధార్, మొబైల్ వివరాలు ఫీల్డ్ రిజిస్టర్ లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. పహాని, పట్టాదారు పాస్ పుస్తకాల వివరాలతో పాటు ప్రస్తుతం సాగు చేస్తున్న రైతుల వివరాలు నమోదు చేయాలని సూచించారు. అటవీ, అసైన్డ్ రెవిన్యూ భూములకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, రైతుల అభ్యంతరాలను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. సర్వే పూర్తయిన అనంతరం అడ్డురాలను ఏర్పాటు చేయాలని, భూ రీ సర్వే ప్రక్రియను నవంబర్ 15లోగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అందిస్తున్న వైద్య సేవలను స్థానిక డాక్టర్ తో పాటు స్టాఫ్ నర్స్ లను అడిగి తెలుసుకున్నారు. రక్త పరీక్షలు, మందుల నిలువలు, వైద్య పరికరాల లభ్యతలపై స్థానిక వైద్యాధికారితో అడిగి తెలుసుకున్నారు. మందుల గదిని పరిశీలించారు, గ్రామస్తులు సిరంజిలు లేవని తెలపడంతో డాక్టర్ను వివరాలు అడిగి తెలుసుకుని, మందులు సిరంజిలు వైద్య పరికరాలు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కోరారు. గుండాల మండలం ముత్తాపురం గ్రామంలోని ఏకలవ్య పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్య బోధన, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, భోజన సదుపాయాలను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులు లేకపోవడాన్ని గమనించి, తరగతుల సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలల కార్యక్రమం నిర్వహించడం ఏమిటని, ప్రిన్సిపల్ను ప్రశ్నించారు. విద్యాభ్యాస్యానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, సాంస్కృతిక కార్యక్రమాలు సెలవు రోజుల్లో నిర్వహించుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతి గదులకు హాజరయ్యేలా చూడాలన్నారు. పాఠశాలలో మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంటశాలను, స్టోర్ రూములను పరిశీలించగా బంగాళదుంపలు కుళ్లిపోయి ఉండడం గమనించి వైస్ ప్రిన్సిపల్ తో కూలిపోయిన కూరగాయలను ఏర్పించారు. పంచదారలో చీమలు ఉండడానికి గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారహితంగా వ్యవహరించిన వంట పని

మనిషిని విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించగా సాంబార్, రసం పలుచగా ఉండడానికి గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈరోజు మెనూ ప్రకారం బిరియాని వడ్డించాల్సి ఉండగా అందుకు అనుగుణంగా భోజనం సిద్ధం చేయకపోవడాన్ని ప్రశ్నించారు. మెనూ తప్పకుండా పాటించాలని ఆదేశించారు. పాఠశాలలో లోపాలను గమనించిన కలెక్టర్ ప్రిన్సిపల్కు షోకాస్ మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వసతులు, పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బత్తిని సంగీత, ఎంపీడీవో బాలరాజు, ఎంఈఓ పార్వతి, ఎంపీ ఓ త్రిలోక్, సర్వేయర్ శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అశ్వరావుపేట నియోజకవర్గం అధ్యక్షులుగా గద్దల అప్పారావు నియమకం

ప్రజా జ్యోతి అశ్వరావుపేట (అక్టోబర్ 30) : కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నూతన అధ్యక్షుడిగా గద్దల అప్పారావు నియమితులయ్యారు. స్థానిక నియోజకవర్గ శాసనసభ్యులు జారీ ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ గద్దల రమేష్ చేతుల మీదుగా గద్దల అప్పారావుకు శుక్రవారం అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు నూతన అధ్యక్షుడిగా నియామక పత్రాన్ని అందుకొన్న గద్దల అప్పారావు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, ఎమ్మెల్యే జారీ ఆదినారాయణకు, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ గద్దల రమేష్కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఎస్సీ కుటుంబానికి చేరేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా ఎస్సీ సెల్ను గ్రామ స్థాయి నుండి మరింత బలోపేతం చేస్తామని, పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే జారీ ఆదినారాయణ మరియు జిల్లా చైర్మన్ గద్దల రమేష్ మాట్లాడుతూ… గద్దల అప్పారావు నాయకత్వంలో అశ్వారావుపేట నియోజకవర్గంలో ఎస్సీ సెల్ మరింత చురుగ్గా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గాల హక్కుల పరిరక్షణకు, పార్టీ అభివృద్ధికి శ్రమించాలని కోరుతూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఎస్సీ సెల్ ప్రతినిధులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలియజేశారు.

గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పనులే పునాది!

బూర్గంపహాడ్, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి):
ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు, గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని జడ్పీ సీఈవో నాగలక్ష్మి సూచించారు. ఉపాధి పనులు కేవలం కూలీలకు ఉపాధి కల్పించడానికే పరిమితం కాకుండా, గ్రామాల అభివృద్ధికి దోహదపడేలా ఉండాలని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం బూర్గంపహాడ్ మండలంలోని తాళ్లగొమ్మూరు రైతువేదికలో ఇరవెండి, మోతే పట్టీనగర్, తాళ్లగొమ్మూరు, కోయగూడెం, సారపాక, ముసలిమడుగు, కృష్ణసాగర్ గ్రామాలకు చెందిన మేట్లకు వీబీ–జీ–రామ్‌జీ పథకం అమలు, పనుల నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పథకం లక్ష్యాలు, విధివిధానాలపై మేట్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, తమ నైపుణ్యాలను పెంపొందించుకుని పనుల నిర్వహణలో సమర్థవంతంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, స్థానిక అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ముఖ్యంగా వర్షపు నీటిని ఒడిసిపట్టేలా నీటి సంరక్షణ పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు పెరిగేలా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని ఎంపీడీవో జమలారెడ్డి తెలిపారు. నీటి వనరుల సంరక్షణతో పాటు గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే పనులను గుర్తించి అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీవో రామకృష్ణ, ఏపీవో విజయలక్ష్మి, ఈసీ వెంకట్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల మేట్లు పాల్గొన్నారు.

జాతీయ వేదికపై మెరిసిన అడవి బిడ్డ..!

- రెండు బంగారు పతకాలతో సత్తా..!
- కరకగూడెం గిరిజన బాలిక అద్భుతం..
- జిల్లా ఎస్పీ ప్రత్యేక అభినందనలు..!
- చెన్నైలో చరిత్ర సృష్టించిన తొలెం శ్రీ తేజ..
- భద్రాద్రి ఖ్యాతి జాతీయ స్థాయికి..!
- హర్డిల్స్ లో దూసుకెళ్లిన తేజ.. హెప్టాథ్లాన్ లోనూ స్వర్ణం...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. అక్టోబర్ 30, ప్రజాజ్యోతి...
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిడ్డ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. కరకగూడెం మండలానికి చెందిన గిరిజన బాలిక తొలెం శ్రీ తేజ చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన 41వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ లో అదరగొట్టింది. 100 మీటర్ల హర్డిల్స్, హెప్టాథ్లాన్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు సాధించి జిల్లా కీర్తిని జాతీయ స్థాయిలో నిలబెట్టింది. మారుమూల అడవి ప్రాంతం నుంచి వచ్చి జాతీయ ఛాంపియన్ గా నిలవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ శ్రీ తేజను, ఆమె కోచ్ పి. నాగేంద్ర బాబును ప్రత్యేకంగా అభినందించారు. మారుమూల గిరిజన ప్రాంతం నుంచి అంచెలంచెలుగా ఎదిగి రెండు పతకాలు సాధించడం గర్వకారణమని ఎస్పీ అన్నారు. శ్రీ తేజ విజయం జిల్లాలోని గిరిజన బాలికలకు గొప్ప స్ఫూర్తిదాయకమని, ఆమెను ఆదర్శంగా తీసుకుని మరింత మంది క్రీడల్లో రాణించాలని ఎస్పీ ఆకాంక్షించారు. కఠోర శ్రమ, క్రమశిక్షణ, పట్టుదలతోనే ఇలాంటి విజయాలు సాధ్యమని తెలిపారు. భవిష్యత్తులో భారతదేశం తరఫున అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి కీర్తి తీసుకురావాలని సూచించారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ మార్గదర్శకత్వం లో శిక్షణ పొందుతూ ఈ స్థాయికి చేరడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. మహీధర్ పాల్గొన్నారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు అమలు చేయాలి - సిఐటియు జిల్లా అధ్యక్షులు బ్రహ్మచారి

కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్ 30,(ప్రజా జ్యోతి) రాష్ట్రవ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో పనిచేస్తున్న 17వేల మంది ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. బ్రహ్మచారి డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మెకు సిఐటియు సంఘీభావం తెలిపారు, కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ఎన్హెచ్ఎం ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు , సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అన్ని రకాల పనులు చేస్తున్నప్పటికీ వేతనాలు, సౌకర్యాల్లో వివక్షత కల్పించడం అన్యాయమని అన్నారు, ఉద్యోగులందరికీ ఈ హెచ్ ఎస్ (ఎంప్లాయ్ హెల్త్ స్కీమ్) ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విధుల్లో మరణించిన ఉద్యోగి కుటుంబానికి 50 లక్షలు నష్టపరిహారంకుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్ హెచ్ ఎస్ స్కీం లో నూటికి 90 శాతం మంది మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారని వారికి ప్రసూతి సెలవు లేకపోవడం రాజ్యాంగ వ్యతిరేకమని రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కులను సైతం ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు ప్రభుత్వాలు అమలు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు ,జీవో నెంబర్ 11 95 వల్ల తగ్గిన వేతనాలను సవరించి అన్ని క్యాడర్ల వారికి న్యాయం చేస్తూ పెంచిన జీతాల్లో మార్పులు లేకుండా కొత్త జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నడుస్తున్న ఎన్ హెచ్ ఎం స్కీం వల్ల కరోనా టైం లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాయని ఇప్పటికీ రాష్ట్రంలోనూ, దేశంలోనూ మెరుగైన నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల పాత్ర కీలకంగా ఉందని అన్నారు,. ప్రజల ప్రాణాలను రక్షిస్తూ ఆరోగ్యవంతమైన రాష్ట్రాన్ని, దేశాన్ని నిర్మిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల శ్రమకు తగిన గుర్తింపు గౌరవాన్ని కల్పించాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల డిమాండ్స్ న్యాయబద్ధమైనవని వాటిని అమలు చేయడం వల్ల ప్రభుత్వానికి అదనపు భారం ఉండదని అన్నారు, మంత్రులు, ఎమ్మెల్యేలు ,ఎంపీలు తమ ఇష్టానుసారంగా వేతనాలు సౌకర్యాలను పెంచుకుంటున్నారని క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగులు కార్మికులకు వేతనాలు పెంచాలంటే బడ్జెట్ లేదని నిధులు కొరతని కుంటి సాకులు చెబుతున్నారని విమర్శించారు. సమ్మె డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కారం చేయాలని చర్చలు జరిపి డిమాండ్లను అంగీకరించి వాటి అమలుకు ప్రభుత్వం నిర్దిష్ట ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు, సమ్మె పట్ల ప్రభుత్వ వైఖరి మారకపోతే సమ్మెను ఉధృతం చేయడం కోసం సిఐటియు సమ్మెలో ప్రత్యక్ష భాగస్వామిగా అవుతుందని అన్నారు,.సిఐటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాదులో జరిగిన రెండు రోజుల మహాధర్నాలు ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల డిమాండ్లను సైతం ప్రభుత్వం పరిష్కారం చేయాలని సిఐటియు డిమాండ్ చేసిందని నాయకులు తెలిపారు. భవిష్యత్తులో సమ్మెకు సిఐటియు అండగా ఉంటుందని పేర్కొన్నారు. మద్దతు తెలియజేసిన వారిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి కే సత్య, సిఐటియు గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు నరసింహారావు, శ్రీను తదితరులు ఉన్నారు

బీసీఏ లో విలీనం వద్దుబిబి 57 కులాల హక్కులు కాపాడాలి

- ముదిరాజ్ కులస్తులను బిసి ఏ గ్రూపులో చేర్చే ప్రతిపాదనను పున: పరిశీలించాలి

- కలెక్టరేట్ ఎదుట బి సి ఏ లోని 57 కులాల ప్రతినిధుల డిమాండ్

కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 30,(ప్రజాజ్యోతి) : బిసి ఏ గ్రూపులో ఉన్న ముదిరాజ్ కులస్తులను బిసి ఏ గ్రూపులో చేర్చే ప్రతిపాదనను పున పరిశీలించాలని బీసీ ఏ లోని 57 కులాల ప్రతినిధులు డిమాండ్ చేశారు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జరిగిన ఆందోళన కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఈ ప్రతిపాదన అమలయితే ఇప్పటికే వెనుకబడిన తమ కులాల విద్యార్థులు, నిరుద్యోగులకు విద్య ,ఉద్యోగ అవకాశాలు మరింత దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు, ఇటీవల హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో జరిగిన ముదిరాజ్ కులస్తుల సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీ ఏలో చేర్చే అంశంపై హామీ ఇచ్చినట్లు తెలిపారు, గతంలోనూ ఇలాంటి ప్రయత్నాలు జరిగినప్పుడు బీసీ ఏ లోని నాయి బ్రాహ్మణ ,రజక తదితర కులాల నాయకులు న్యాయపరంగా పోరాటం చేసిన విషయాన్ని గుర్తు చేశారు, న్యాయస్థానాల్లో తమ హక్కుల పరిరక్షణ కోసం పోరాడినప్పటికీ ప్రస్తుతం రాజకీయ హామీల రూపంలో మరోసారి ఈ అంశం తెరపైకి రావడం ఆందోళన కలిగిస్తుంది అన్నారు ,ఉనికికే ముప్పు ఉందా! బీసీ ఏలో ఇప్పటికే 57 కులాలు కొనసాగుతున్నాయని సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన ఈ వర్గాలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో లభిస్తున్న అవకాశాలు పరిమితం గానే ఉన్నాయని నాయకులు పేర్కొన్నారు ,అధిక జనాభా కలిగిన ముదిరాజ్ కులాన్ని బిసి ఏ లో చేరిస్తే తమ కులాలకు చెందిన పేద విద్యార్థులు నిరుద్యోగులపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు, తరతరాలుగా వెనకబడిన తమ వర్గాల హక్కులు రిజర్వేషన్ ప్రయోజనాలు దెబ్బ తినకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు, మరోవైపు సాంప్రదాయ వృత్తులు కార్పొరేట్ వ్యవస్థ ప్రభావంతో కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని అన్నారు, కనీసం తమ పిల్లలైనా చదువుకొని ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆశలకు ఆటంకం కలగకూడదని అన్నారు, ఈ విషయంలో 57 కులాల సంఘాలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు, ప్రభుత్వం తమ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకపోతే దశలవారీగా ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు, ధర్నాలు, రాస్తారోకోలు, నిరాహార దీక్షలతో పాటు అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు, భావితరాల భవిష్యత్తును కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు అనంతరం పలు డిమాండ్ తో కూడా పడితే పత్రాన్ని కలెక్టరేట్లోని అధికారులకు అందజేశారు, కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు తూముల సదానందం ,గౌరవ అధ్యక్షులు కొమరవెల్లి రవీందర్, కోశాధికారి సోమలపల్లి బాలకృష్ణ, పాల్వంచ పట్టణ అధ్యక్షులు ఉప్పర్ల పుల్లారావు ,జిల్లా సీనియర్ నాయకులు ఎర్ర శ్రీను, జంపాల వెంకన్న ,జంపాల రమేష్ ,శ్రీరాములు, ఉపేందర్ ,ఉదయ్ కుమార్ ,బి జి ఎస్ పండు, నాగేంద్రబాబు, మనితేజ ,లక్ష్మీదేవి పల్లి మండలం అధ్యక్షులు ముత్యాల వేణు, కార్యదర్శి నాగవల్లి రాజు ,ముత్యాల రమేష్ ,రామకృష్ణ, కొత్తగూడెం పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్యాల శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

టాటా ఏఐఏలో బిజినెస్ పార్టనర్‌గా తానికొండ నాగేంద్ర రెడ్డి

- టాటా ఏఐఏలో చేరిన నాలుగేళ్లలోనే కీలక స్థానం

- ఇన్సూరెన్స్ రంగంలోనూ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, వేలాది కుటుంబాలకు ఆర్థిక భద్రత

భద్రాచలం, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): టాటా గ్రూప్‌కు చెందిన టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో చీఫ్ బిజినెస్ లీడర్ స్థాయి నుంచి ప్రతిష్టాత్మక బిజినెస్ పార్టనర్‌గా ప్రమోషన్ పొందిన తొలి కొత్తగూడెం జిల్లా వాసిగా తానికొండ నాగేంద్ర రెడ్డి గుర్తింపు పొందారు. గతంలో వేలాది మంది నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించిన ఆయన, టాటా ఏఐఏలో చేరిన నాలుగేళ్లలోనే ఈ స్థాయికి ఎదిగారు. ఇన్సూరెన్స్ రంగంలోనూ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వేలాది కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తన కృషి, నాయకత్వ నైపుణ్యాలు, కష్టమర్ల విశ్వాసంతో ఈ ప్రతిష్టాత్మక ప్రమోషన్ సాధించారు. తన ఎదుగుదలకు సహకరించిన టీమ్ లీడర్లు, అడ్వైజర్లకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరింత మంది నిరుద్యోగులకు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని వెల్లడించారు. నాగేంద్ర రెడ్డి విజయంపై సీనియర్ పార్టనర్ సురభి ముకుంద రావు, పోతురెడ్డిపల్లి రామగోపి, కంపెనీ ఉద్యోగులు, తోటి లీడర్లు, అడ్వైజర్లు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

రైఫిల్ షూటింగ్ క్రీడాకారులతో జిల్లా క్రీడా అధికారి భేటీ..!

- శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రైఫిల్ షూటింగ్ రేంజ్ తీరుపై ఆరా...

- షూటర్లకు మెరుగైన శిక్షణకు కృషి...

- పాల్వంచ మినీ స్టేడియంలో షూటింగ్ రేంజ్ ఏర్పాటుకు చర్యలు...

- జిల్లా, రాష్ట్ర, జోనల్, ఎస్జీఎఫ్ పోటీల్లో విజేతలతో ముఖాముఖి..!

- జిల్లా యువజన క్రీడా అధికారి బి. అనూష హామీ...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి. అక్టోబర్ 30, ప్రజాజ్యోతి...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైఫిల్ షూటింగ్ క్రీడాకారులను జిల్లా యువజన, క్రీడల అధికారి బి. అనూష కలిశారు. గురువారం జిల్లా కార్యాలయంలో క్రీడాకారులు, వారి తల్లిదండ్రులతో ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు. శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు ఉన్న రైఫిల్ షూటింగ్ రేంజ్ నిర్వహణ, క్రీడా సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, జోనల్ స్థాయి మరియు ఎస్జీఎఫ్ క్రీడా పోటీలలో పాల్గొని విజయాలు సాధించిన క్రీడాకారుల అనుభవాలను విన్నారు. భవిష్యత్తులో సాధించాలనుకుంటున్న లక్ష్యాల గురించి క్రీడాకారులను అడిగి తెలుసుకున్నారు. ఉన్నత స్థాయికి ఎదగడానికి అవసరమైన ప్రోత్సాహం, శిక్షణ సదుపాయాలు మరియు భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించారు. క్రీడాకారుల తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు, పాల్వంచలోని శ్రీనివాస కాలనీ మినీ స్టేడియంలో అందుబాటులో ఉన్న ఒక హాల్ లో రైఫిల్ షూటింగ్ రేంజ్ ను ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని జిల్లా క్రీడా అధికారి హామీ ఇచ్చారు. ఈ సదుపాయం అందుబాటులోకి వస్తే జిల్లా క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందుతుందని, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో మరిన్ని విజయాలు సాధించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైఫిల్ షూటింగ్ కోచ్ అబ్దుల్ నబి, క్రీడాకారులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ప్రజా సంక్షేమ సంఘం మహిళా కమిటీ జిల్లా అధ్యక్షురాలు అందె దుర్గ

భద్రాచలం, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రజా సంక్షేమ సంఘం మహిళా కమిటీ జిల్లా అధ్యక్షురాలు అందె దుర్గ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో మరుగుదొడ్ల పరిశుభ్రత లోపించిందని, మురుగునీటి పైపుల అనుసంధానంలో సమస్యలు ఉన్నాయని తెలిపారు. కొంతమంది నర్సింగ్ సిబ్బంది ప్రవర్తన రోగులు, వారి కుటుంబ సభ్యులకు ఇబ్బందికరంగా ఉందని పేర్కొన్నారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సిబ్బంది ప్రవర్తనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. రోగులకు వైద్య పరీక్షల ఫలితాలు, చికిత్స వివరాలను స్పష్టంగా తెలియజేయాలని, ఇతర ఆసుపత్రులకు తరలించాల్సి వస్తే అందుకు గల కారణాలను వివరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులు పేద ప్రజలకు ప్రధాన వైద్య ఆధారమని, అధికారులు తక్షణమే స్పందించి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అందె దుర్గ డిమాండ్ చేశారు.

ఆదిసేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలి

- నవంబర్ 1 నుంచి 15 వరకు ప్రత్యేక కార్యక్రమాలు

- భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్

భద్రాచలం, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): ఆదివాసీ సమాజ అభివృద్ధి, సంక్షేమం, ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో నవంబర్ 1 నుంచి 15 వరకు నిర్వహించనున్న ఆదిసేవా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మండలాల వారీగా ఏర్పాట్లను సమీక్షించారు. ప్రతి ఆదిసేవా కేంద్రంలో నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రచార ఫ్లెక్సీలు, సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయడంతో పాటు డప్పు చాటింపు ద్వారా ప్రజలకు సమాచారం అందించాలని సూచించారు. ప్రతిరోజూ నిర్వహించే కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలని, ప్రతి కేంద్రానికి ఇద్దరు వాలంటీర్లను నియమించి కేంద్రాల స్థానాల మ్యాపింగ్‌ను నవీకరించాలని ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రత్యేక అధికారులను నియమించి రోజువారీ వివరాలను ఐటీడీఏకు పంపించాలని తెలిపారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, కవితా రచన, సాంస్కృతిక పోటీలు నిర్వహించి ఆదిసేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, పత్రికా కథనాలను ప్రత్యేకంగా భద్రపరిచి ఆదిప్రసార పోర్టల్‌లో రోజువారీ వివరాలు నమోదు చేయాలన్నారు. నవంబర్ 1 నుంచి 15 వరకు విద్యాసంస్థల్లో నిర్వహించిన కార్యక్రమాల సమగ్ర నివేదికను నవంబర్ 17న డీడీ (టీడబ్ల్యూ), ఆర్సీఓ గురుకులాలకు సమర్పించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని పీవో కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఓ (జనరల్) డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణార్థం రక్తదాన శిబిరం

- పాల్వంచ పోలీసుల ఆధ్వర్యంలో 108 మంది రక్తదానం

పాల్వంచ, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు, ఇతర రోగుల ప్రాణాలను కాపాడే లక్ష్యంతో పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్, సీఐ కె. సతీష్‌కుమార్, టౌన్ ఎస్సైలు టి. నాగరాజు, జి. విజయ, రూరల్ ఎస్సై సురేష్, ములకలపల్లి ఎస్సై మధు ప్రసాద్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వీరితో పాటు పాల్వంచ పట్టణానికి చెందిన పలువురు యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ శిబిరంలో మొత్తం 108 మంది రక్తదానం చేసి మానవతా విలువలను చాటుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆర్. సతీష్, సీఐ కె. సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. రక్తదానం అనేది మరొకరికి ప్రాణదానం చేయడంతో సమానమని పేర్కొన్నారు. ముఖ్యంగా తలసేమియా బాధిత చిన్నారులు, అత్యవసర వైద్య చికిత్సలు పొందుతున్న రోగులకు రక్తం ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకొని, స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రజలు, యువతకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సేవా గుణమే సమాజానికి నిజమైన బలం

- మానవ సేవే మాధవ సేవ-సేవాభారతి ప్రాంత సేవా ప్రముఖ్ శివశంకర్

చర్ల, అక్టోబర్ 30: (ప్రజా జ్యోతి): ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకుని ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని తెలంగాణ సేవాభారతి ప్రాంత సేవా ప్రముఖ్ శివశంకర్ పిలుపునిచ్చారు. దేశం కోసం, ధర్మం కోసం పనిచేసినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ తెలంగాణ, వనవాసీ కళ్యాణ పరిషత్, సేవాభారతి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రామదాసు ఆరోగ్య సేవాయాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం చర్లలోని కొమరం భీం విద్యార్థి నిలయంలో సమావేశం నిర్వహించారు. సేవాభారతి చర్ల మండల కార్యదర్శి కీర్తి సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శివశంకర్ వైద్య విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి గిరిజన గ్రామాల్లో వైద్య సేవలు అందించేందుకు 500 మంది వైద్య విద్యార్థులు ముందుకు రాగా, వారిలో 100 మందిని ఎంపిక చేసి చర్ల మండలంలోని పది మారుమూల ఆదివాసీ గ్రామాల్లో మూడు రోజులపాటు ఉచిత వైద్య సేవలు అందించేందుకు సిద్ధం చేయడం అభినందనీయమన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి గిరిజనులకు సేవలందించేందుకు వైద్య విద్యార్థులు ముందుకు రావడం స్ఫూర్తిదాయకమని అన్నారు. వనవాసీ కళ్యాణ పరిషత్ 1952లో ప్రారంభమై నేడు దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాలకు విస్తరించిందని తెలిపారు. ప్రతి ఏటా సుమారు ఏడు వేల మంది నిరుపేద ఆదివాసీ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. మారుమూల అటవీ ప్రాంత గ్రామాల్లో విద్య, వైద్య సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ఈ సంస్థ పనిచేస్తోందని వివరించారు. ఈ సంస్థ ద్వారా విద్యనభ్యసించిన పలువురు నేడు వివిధ ఉన్నత హోదాల్లో స్థిరపడ్డారని తెలిపారు. జిల్లాలో సంస్థ ఆధ్వర్యంలో 62 ఏకోపాధ్యాయ విద్యా కేంద్రాలను నిర్వహిస్తూ ఆదివాసీ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపుతున్నట్లు వెల్లడించారు. ఆపద సమయంలో వనవాసీ కళ్యాణ పరిషత్, సేవాభారతి సంస్థలు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని శివశంకర్ అన్నారు. కరోనా సమయంలో అనేక మంది కార్యకర్తలు వైరస్ బారిన పడినప్పటికీ వెనుకడుగు వేయకుండా ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు. సమాజం కోసం పనిచేసే వ్యక్తులను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని, పేదలకు సేవ చేసినప్పుడే మానవ జీవితానికి సార్థకత ఉంటుందని అన్నారు. ఛత్రపతి శివాజీ, స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు వంటి మహనీయులు దేశం కోసం చేసిన సేవలు, త్యాగాల వల్లే నేటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని గుర్తుచేశారు. దేశం కోసం ఎందరో ప్రాణత్యాగాలు చేసిన ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ స్వార్థం కోసం కాకుండా సమాజం కోసం పనిచేయాలని, ధైర్యంతో ముందుకు సాగుతూ లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. వైద్య విద్యార్థులు మారుమూల గిరిజన గ్రామాలను సందర్శించి మూడు రోజులపాటు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో న్యూరో సర్జన్ డాక్టర్ నాగరాజు, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సాయి సందీప్, వనవాసీ కళ్యాణ పరిషత్ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలతతో పాటు ఖమ్మం, సిద్దిపేట, మహబూబాబాద్, నల్గొండ, భూపాలపల్లి, సూర్యాపేట, రంగారెడ్డి, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన 100 మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వద్దు

- పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి - భద్రాచలం ఎంఈఓ పద్మ

భద్రాచలం, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): పాఠశాలల్లో విద్యా కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించకుండా, నిర్దేశిత గడువులోగా అన్ని పనులు పూర్తి చేయాలని భద్రాచలం మండల విద్యాశాఖ అధికారిణి కె. పద్మ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం మండల విద్యా వనరుల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2, ఎస్ఏ పరీక్షలకు సంబంధించిన ఆన్‌లైన్ నమోదు, వివరాల అప్‌లోడ్, అపార్ ఐడీల నమోదు వంటి పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అలాగే ప్రశస్త్ యాప్‌లో విద్యార్థుల స్క్రీనింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, విద్యార్థుల విద్యా పురోగతి, సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు పి. లక్ష్మీనారాయణ, రాజా

శ్రీనివాస్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు గోపి, రామకృష్ణ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ బేబీ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో దళారీ వ్యవస్థను అరికట్టాలి

- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

చర్ల, అక్టోబర్ 30: (ప్రజా జ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో ధాన్యం కొనుగోళ్ల పేరుతో కొనసాగుతున్న దళారీ వ్యవస్థను తక్షణమే అరికట్టి, ఆదివాసీ రైతులకు న్యాయం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం చర్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ భద్రాద్రి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ధాన్యం కొనుగోళ్లలో దళారీ వ్యవస్థ విచ్చలవిడిగా కొనసాగుతోందని ఆరోపించారు. వరి ధాన్యం కొనుగోలు సమయంలో తేమశాతం పేరుతో దళారీలు కుమ్మక్కై ఆదివాసీ రైతులకు గిట్టుబాటు ధర దక్కకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాన్ని ఆసరాగా చేసుకుని కొందరు మధ్యవర్తులు లాభాలు పొందుతున్నారని అన్నారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతానికి వలస వచ్చిన గిరిజనేతరులు వ్యాపారాల పేరుతో ఆదివాసీ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేసేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు (సీసీ కేంద్రాలు) ఏర్పాటు చేయాలని, ఇందిరా క్రాంతి పథం మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనవసర నిబంధనలు, ఆంక్షల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా వారి నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి న్యాయం చేయాలని కోరారు. ఈ సమస్యపై వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ఏజెన్సీలో దళారీ వ్యవస్థను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని పూనెం వరప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చర్ల మండల తుడుందెబ్బ అధ్యక్షులు పూనెం రవికిరణ్, ఉపాధ్యక్షులు తుర్రం ఆదినారాయణ, పురిటి ప్రశాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ కలం శ్రీనివాస్, సహాయ కార్యదర్శి తాటి శ్రీను, కార్యదర్శి అలెం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

చర్ల, అక్టోబర్ 30: (ప్రజా జ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను ఎలా కాపాడుకోవాలో ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, ముఖ్యంగా సీపీఆర్ విధానంపై విద్యార్థులు ప్రాథమిక పరిజ్ఞానం కలిగి ఉండాలని వైద్య విద్యార్థులు సూచించారు. వనవాసి కళ్యాణ పరిషత్, సేవా భారతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న మెగా వైద్య శిబిరంలో భాగంగా శుక్రవారం చర్ల మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు ప్రాణరక్షణ విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని బాయ్స్ హైస్కూల్, గర్ల్స్ హైస్కూల్, కస్తూర్బా పాఠశాల, ఉంజుపల్లి పాఠశాలల్లో వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మనిషి అకస్మాత్తుగా స్పృహ కోల్పోయినప్పుడు ఎలాంటి సహాయ సహకారాలు అందించాలి, అత్యవసర సమయంలో ఎలా స్పందించాలి, బాధితుడికి ప్రథమ చికిత్స ఎలా చేయాలి అనే అంశాలను విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా గుండె ఆగిపోయిన పరిస్థితుల్లో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్) చేయడం ద్వారా బాధితుడి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. సీపీఆర్ చేసే సరైన విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర సమయంలో అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. కేవలం అవగాహన కలిగి ఉండటమే కాకుండా, అవసరమైన సమయంలో సరైన పద్ధతిలో స్పందించడం ఎంతో ముఖ్యమని అన్నారు. అనంతరం విద్యార్థులకు సీపీఆర్ చేసే విధానాన్ని ప్రాక్టికల్‌గా డెమో ద్వారా ప్రదర్శించి చూపించారు. ఒక్కో దశను వివరంగా తెలియజేస్తూ, ఆపద సమయంలో భయపడకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. ప్రమాదాలు, గుండె సంబంధిత అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు తక్షణ సహాయం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని అవగాహన కల్పించారు. విద్యార్థులకు చిన్న వయసు నుంచే ఇలాంటి ప్రాణరక్షణ నైపుణ్యాలపై అవగాహన కల్పించడం వల్ల సమాజంలో అత్యవసర వైద్య సహాయంపై చైతన్యం పెరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మెగా వైద్య శిబిరానికి ముందు నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థులకు ఉపయోగకరంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

భార్య అదృశ్యంపై పాల్వంచ రూరల్ పోలీసులకు ఫిర్యాదు

- ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి

పాల్వంచ, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి:

పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తోగ్గూడెం గ్రామానికి చెందిన మోడిగం నాగరాజు (27) తన భార్య మోడిగం రామలక్ష్మి (26) కనిపించడం లేదని పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. నాగరాజుకు సుమారు మూడేళ్ల క్రితం ములకలపల్లి మండలం రాసనపేట గ్రామానికి చెందిన రామలక్ష్మితో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. ఈ క్రమంలో అక్టోబర్ 3వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో నాగరాజు తన తండ్రితో కలిసి కూలి పనుల నిమిత్తం జగన్నాధపురం వెళ్లాడు. తిరిగి సాయంత్రం 5 గంటలకు ఇంటికి చేరుకోగా భార్య కనిపించలేదు. ఆమె సెల్‌ఫోన్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళనకు గురయ్యాడు. చుట్టుపక్కల వారిని విచారించగా గ్రామం బయట ఓ ఆటో ఎక్కి వెళ్లినట్లు తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అప్పటి నుంచి బంధువుల ఇళ్లతో పాటు పరిసర గ్రామాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదని తెలిపాడు.

అదృశ్యమైన మహిళ వివరాలు:

పేరు: మోడిగం రామలక్ష్మి

వయస్సు: 26 సంవత్సరాలు

స్వగ్రామం: రాసనపేట, ములకలపల్లి మండలం

ఛాయ: నలుపు రంగు

ఎత్తు: సుమారు 4 అడుగుల 9 అంగుళాలు

చివరిసారిగా ధరించిన దుస్తులు: ఆకుపచ్చ రంగు పంజాబీ డ్రెస్, నీలం రంగు ప్యాంటు.

సదరు మహిళ ఆచూకీ తెలిసిన వారు లేదా ఆమెను ఎక్కడైనా గుర్తించిన వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

పలు శుభకార్యాల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన కొత్వాల దంపతులు

-- బద్దికిశోర్ కుమార్తె నిశ్చితార్థ వేడుకకు హాజరు. - వివాహ వేడుకలు, రిసెప్షన్‌లోనూ పాల్గొన్న కార్పొరేటర్

పాల్వంచ, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి: పాల్వంచ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన పలు శుభకార్యాల్లో డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, పాత పాల్వంచ 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి దంపతులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కాంగ్రెస్ నాయకుడు, 1వ డివిజన్ బొల్లోరిగూడెం నివాసి బద్దికిశోర్ కుమార్తె వివాహ నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పాత పాల్వంచకు చెందిన కేటీపీఎస్ ఉద్యోగి వల్లపు యాకయ్య, లింగమ్మ దంపతుల కుమారుడు అఖిల్ వివాహ వేడుకల్లో, అయ్యప్పనగర్‌కు చెందిన సేవాలాల్ సేన జిల్లా గౌరవాధ్యక్షుడు, కాంట్రాక్టర్ అజ్మీరా బాబునాయక్, ప్రమీల దంపతుల కుమారుడు హనుమంతరావు, రిషికల వివాహ రిసెప్షన్‌లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, మహిపతి రామలింగం, వై. వెంకటేశ్వర్లు, కేశబోయిన కోటేశ్వరరావు, బూసి శ్రీను, కనగాల రాంబాబు, బొందిల బాలు, గణేష్, బండారు తేజ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం గ్రంథాలయంలో ఘనంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమం

భద్రాచలం, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి) : మహిళా శిశు సంక్షేమ శాఖ వారి ఆదేశాల మేరకు మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఈరోజు భద్రాచలం గ్రంథాలయంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పరిసరాల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ, స్వచ్ఛత ప్రాముఖ్యతను వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిశుభ్రమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత డిఎంసి సంతోష్ రూప, గ్రంథాలయ లైబ్రేరియన్ జానీ గారు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

రామాలయం చుట్టూ రోడ్డు విస్తరణకు స్థల పరిశీలన

అధికారులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకటరావు

భద్రాచలం, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా ఆలయం చుట్టూ రోడ్డు విస్తరణ, కరకట్ట పక్కన సర్వీసు రోడ్డు ఏర్పాటుకు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శుక్రవారం వివిధ శాఖల అధికారులతో కలిసి స్థల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం చుట్టూ రోడ్ల విస్తరణకు అవసరమైన స్థలాలను, కరకట్ట పక్కన సర్వీసు రోడ్డు ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను పరిశీలించారు. ఆలయానికి వచ్చే భక్తులతో పాటు స్థానిక ప్రజలకు రాకపోకల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పరిశీలనలో పంచాయతీరాజ్, ఇరిగేషన్, దేవస్థానం, పంచాయతీ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు. భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, మహిళా, యువజన నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం "ప్రాణదానం" తో సమానం

- పట్టణ భద్రతతో పాటు "ప్రాణదానానికి" భద్రత కల్పిస్తున్న పోలీసులు

- పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా

- 100 మందికి పైగా రక్తదానం

భద్రాచలం, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): రక్తదానం ప్రాణదానం తో సమానం అని భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా భద్రాచలం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చర్ల రోడ్డులోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 100 మందికి పైగా స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ అరుణ్ కుమార్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన కలిగి ఉండాలని, అపోహలను వీడి మానవతా దృక్పథంతో రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజాసేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ సట్ల రాజు, పోలీసు అధికారులు, సిబ్బంది, మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళి, మరో స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు జిందా, స్వచ్ఛంద రక్తదాతలు పాల్గొన్నారు.

గోవిజ్ఞాన పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలి

గోవిజ్ఞాన పుస్తకాలను ఆవిష్కరించిన ఐటీడీఏ పీవో బి. రాహుల్



భద్రాచలం, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి) : గోసేవ ఆధ్వర్యంలో నిర్వహించే గోవిజ్ఞాన పరీక్షల్లో ఐటీడీఏ పరిధిలోని పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిభ చాటాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ పిలుపునిచ్చారు. శుక్రవారం తన కార్యాలయంలో గోసేవ నిర్వాహకులు రూపొందించిన గోవిజ్ఞాన పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసి, వాటిపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వచ్చే నెల 7న కొత్తగూడెంలోని స్వర్ణభారతి పాఠశాలలో జిల్లా స్థాయి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నవంబర్ 15న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో విజేతలకు మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండో బహుమతిగా రూ.50 వేలు, మూడో బహుమతిగా రూ.25 వేలు అందజేయడంతో పాటు ప్రోత్సాహక బహుమతులు గవర్నర్ చేతుల మీదుగా ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోసేవ జిల్లా అధ్యక్షుడు కే. యాకయ్య స్వామి, యోగా గురువు గుమలాపురం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల నిర్వహణలో మేట్ల పాత్ర కీలకం

- వి బి - జి, ఆర్ ఏ ఎం - జీ పథకంపై మేట్ ఓరియంటేషన్ శిక్షణలో జెడ్పీ సీఈఓ బి. నాగలక్ష్మి

పాల్వంచ, అక్టోబర్ 30, (ప్రజాజ్యోతి): గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పనులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించడంలో మేట్ల పాత్ర ఎంతో కీలకమని జిల్లా పరిషత్ సీఈఓ బి. నాగలక్ష్మి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం పాల్వంచ మండలంలోని జగన్నాధపురం క్లస్టర్ పరిధిలోని గ్రామపంచాయతీల మేట్లకు మేట్ ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి మాట్లాడుతూ.. వి బి – జి, ఆర్ ఏ ఎం – జీ పథకం కింద గ్రామపంచాయతీల్లో చేపట్టే పనులను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. కూలీలకు పనులపై పూర్తి అవగాహన కల్పిస్తూ, పనులకు వచ్చేలా ప్రోత్సహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. అదేవిధంగా కూలీల హాజరు పట్టికను ఎప్పటికప్పుడు తప్పనిసరిగా సక్రమంగా నమోదు చేయాలని, అర్హులైన కూలీలకు రోజువారీ వేతనం రూ. 308 అందేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో తోగూడెం, బాంట్రుగూడెం, బసవతారక కాలనీ, బిక్కితండా, దంతాలబోర, దంతాలబోర ఎస్సీ కాలనీ, జగన్నాధపురం, కేశవాపురం, లక్ష్మీదేవిపల్లి, నాగారం, నాగారం కాలనీ, రంగాపురం, సోములగూడెం గ్రామపంచాయతీలకు చెందిన మేట్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ రమణ, ట్రైనింగ్ కోఆర్డినేటర్ రాజారత్నం, ఎంపీడీవో పి. రాజారావు, ఈసీ కె. పుల్లయ్య, ఏపీఓ రఘుపతి, జగన్నాధపురం పంచాయతీ కార్యదర్శి వై. చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల నిర్వహణపై మేట్లకు శిక్షణ

చర్ల, అక్టోబర్ 30: (ప్రజా జ్యోతి): చర్ల మండలంలో వి.బి. –జి. రామ్ జి పథకంలో భాగంగా మేట్లకు ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధి హామీ పనుల నిర్వహణలో మేట్ల బాధ్యతలు, విధులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పథకం అమలు విధానం, కూలీలకు పనుల కేటాయింపు, కూలీల హాజరు నమోదు, పని ప్రదేశంలో కొలతలు తీసుకునే విధానం తదితర అంశాలపై మేట్లకు అధికారులు వివరించారు. పనుల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పథకం నిబంధనలను పాటిస్తూ విధులు నిర్వర్తించాలని సూచించారు. శిక్షణలో భాగంగా పని ప్రదేశంలో ఒక క్యూబిక్ మీటరు కొలతను ప్రత్యక్షంగా ప్రదర్శించి, పనుల కొలతలను ఏ విధంగా తీసుకోవాలి, వాటిని ఎలా నమోదు చేయాలి అనే అంశాలను క్షేత్రస్థాయిలో వివరించారు. కూలీలకు పనుల విషయంలో సరైన మార్గదర్శకత్వం అందిస్తూ, పారదర్శకంగా ఉపాధి పనులు జరిగేలా మేట్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఈదయ్య, ఈసీ/ఏపీఓ ఉర్సు సాంబశివరావు, బీఆర్ఎల్ఎఫ్ సంస్థ ప్రతినిధి కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులతో కలిసి పీఎం-కిసాన్ నిధుల విడుదల ప్రత్యక్షప్రసారం వీక్షణ

- పుల్లైగూడెం రైతు వేదికలో పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్ కార్యక్రమం

పాల్వంచ, అక్టోబర్ 30, (ప్రజాజ్యోతి): రైతులు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం–కిసాన్ పథకంలో భాగంగా 24వ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని శుక్రవారం పాల్వంచ క్లస్టర్ పరిధిలోని పుల్లైగూడెం రైతు వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 24వ విడత పీఎం–కిసాన్ నిధుల విడుదల కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులతో కలిసి అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా పీఎం–కిసాన్ పథకం ద్వారా రైతులకు అందుతున్న ఆర్థిక ప్రయోజనాలు, పథకం అమలు విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) నరేష్, పుల్లైగూడెం గ్రామ కార్యదర్శి మౌనికతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు. రైతులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని పథకానికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణపై డీపీఓ తనిఖీలు

- రంగాపురం, నాగారం గ్రామపంచాయతీల్లో పర్యటించిన జిల్లా పంచాయతీ అధికారి బి. అనుష

పాల్వంచ, అక్టోబర్ 30, ప్రజాజ్యోతి: గ్రామపంచాయతీల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి బి. అనుష సూచించారు. శుక్రవారం పాల్వంచ మండలంలోని రంగాపురం, నాగారం గ్రామపంచాయతీలను ఆమె సందర్శించి వివిధ అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని శ్మశానవాటికలు (క్రిమిటోరియంలు), నర్సరీలు, డంపింగ్ యార్డులను తనిఖీ చేయడంతో పాటు గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, భోజనం వడ్డించే విధానం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. గ్రామపంచాయతీలకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని, నర్సరీలు, డంపింగ్ యార్డులు, శ్మశానవాటికలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అభివృద్ధి పనుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ పర్యటనలో మండల పంచాయతీ అధికారి షేక్ శబ్బా, రంగాపురం సర్పంచ్ మలోత్ అనుష, నాగారం సర్పంచ్ ధరావత్ స్వప్న, ఆయా గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

- నషాముక్త్ భారత్‌పై అవగాహన సదస్సు

చర్ల, అక్టోబర్ 30: (ప్రజా జ్యోతి): చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నషాముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం, ఇతర వ్యసనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. నరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ మెడికల్ కళాశాలలకు చెందిన వైద్య విద్యార్థులు (మెడికోలు) పాల్గొని కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక అనారోగ్య సమస్యలు, వ్యక్తిగత జీవితంపై పడే ప్రభావం, కుటుంబ వ్యవస్థపై కలిగే దుష్పరిణామాలను వివరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా అప్రమత్తంగా ఉండాలని, వ్యసనాలకు బానిసలైన వారు వాటి నుంచి బయటపడేందుకు సరైన వైద్య సహాయం పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి. సుధాకర్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

మా నిరసనను వక్రీకరిస్తున్నారు...

- మా నిరసన అధికారులపైనే.. ఎమ్మెల్యేపై కాదు! - సర్వసభ్య సమావేశం బహిష్కరణపై స్పష్టం చేసిన మండల సర్పంచులు

ములకలపల్లి, అక్టోబర్ 30, (ప్రజాజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం బహిష్కరణపై కొందరు కాంగ్రెస్ నాయకులు తమ నిరసనను వక్రీకరిస్తూ తప్పుడు ప్రచారం చేయటాన్ని శుక్రవారం సర్పంచులు కల్లూరి కిషోర్, తుర్రం శ్రీనివాస్, కోర్స ఆదిలక్ష్మి లు ఖండించారు. తమ నిరసన మండల అధికారుల నిర్లక్ష్య వైఖరిపైనే తప్ప ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు వ్యతిరేకంగా కాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అన్ని పార్టీలకు చెందిన సర్పంచులను కలుపుకొని పంచాయతీల అభివృద్ధికి సహకరిస్తున్నారని, ఆయనపై తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలను సర్పంచులకు అందజేయకపోవడం, 45 రోజుల సమీక్షా సమావేశ నివేదికను ఇవ్వకపోవడం, పంచాయతీల నిధుల వినియోగంలో జాప్యం వంటి సమస్యలపైనే ఎంపీడీవోతో పాటు మండల అధికారులను ప్రశ్నించామని పేర్కొన్నారు. తాము ప్రభుత్వానికి లేదా ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నిరసన తెలిపి ఉంటే కాంగ్రెస్, వామపక్ష, బీఆర్ఎస్, స్వతంత్ర పార్టీలకు చెందిన సర్పంచులంతా కలిసి సమావేశాన్ని బహిష్కరించేవారా? అని ప్రశ్నించారు. అన్ని పార్టీలకు చెందిన సర్పంచులు పాల్గొన్నారంటే ఇది పార్టీలకు అతీతమైన సమస్య అని అర్థం చేసుకోవాలన్నారు. అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తే మధ్యలో ఎమ్మెల్యే పేరును ప్రస్తావిస్తూ రాజకీయ వివాదం సృష్టించడం సరికాదన్నారు. సర్పంచుల సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా పంచాయతీల అభివృద్ధి కోణంలో చూడాలని కోరారు. తమ నిరసన అధికారుల నిర్లక్ష్య వైఖరిపైనే కొనసాగుతుందని, ఎమ్మెల్యే జారె ఆదినారాయణపై తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని మరోసారి స్పష్టం చేశారు.

బ్యాంకు ఖాతాదారులు కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేయాలి

- ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలంటే ఖాతా వివరాలు నవీకరించుకోవాలి

- కేవైసీ పూర్తి చేయకుంటే బ్యాంకు సేవలకు అంతరాయం కలిగే అవకాశం

అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి): అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని అన్నపురెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులందరూ తమ ఖాతాలకు సంబంధించిన కేవైసీ వివరాలను తప్పనిసరిగా నవీకరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ సామాజిక భద్రత పథకాలైన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సుకన్య సమృద్ధి పథకం, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాల ప్రయోజనాలను వివరించారు. ప్రతి ఖాతాదారుడు వెంటనే స్పందించి కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఉపాధి హామీ కూలీలు, ఆసరా పింఛన్‌దారులు తమ బ్యాంకు ఖాతాల వివరాలను సరిచూసుకోవాలని తెలిపారు. కేవైసీ పూర్తి చేయని ఖాతాలపై తాత్కాలికంగా లావాదేవీలు నిలిచిపోయే అవకాశం ఉందని, యూపీఐ, ఏటీఎం తదితర బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలగవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లాకావత్ లక్ష్మి, ఉప సర్పంచ్ మారగాని అశోక్, బ్యాంకు మిత్ర పూదారి లక్ష్మి, బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పిట్టల్లా రాలుతున్న చాపలమార్కెట్ వాసులు..!

-ఆ ప్రాంతానికి పట్టిన మాయదారి కీడు శాపం..! - 3 రోజుల్లో 5 శవాలు.. ఒకే ఇంట్లో 4 మరణాలు..!
- మణుగూరు చాపల మార్కెట్ లో నరకం చూస్తున్న జనం..!
- స్కూల్ కు వెళ్లాలంటే పిల్లలకు భయం.. పనికి పోవాలంటే పెద్దలకు భయం.. బస్తీకి రావాలంటేనే వణుకుతున్న జనం..!
- బస్తిలో మురికి కాలువలు... పట్టించుకోని మున్సిపాలిటీ... కమిషనర్ ఉన్నారా..? లేరా..? అంటున్న జనం..!
- ఓట్లప్పుడు వస్తారు.. చావులప్పుడు రారు.. ఎమ్మెల్యే పాయం ఎక్కడ..? అడుగుతున్న జనం...
- బొడ్డురాయి వేయకపోతే ఊరే ఖాళీ.. దిక్కు చూడని నాయకులు.. దేవుడే దిక్కంటున్న బస్తీ వాసులు..!
- చాపల మార్కెట్ కు కీడు వచ్చింది.. ఎమ్మెల్యే గారూ.. ఒక్కసారి వచ్చి చూడండి.. మా ప్రాణాలు కాపాడండి..!
- మా సమస్యకు స్పందించి కధనం రాసిన విలేకరికి, 'ప్రజాజ్యోతి' యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపిన బస్తీ వాసులు...

మణుగూరు చాపల మార్కెట్ బస్తీ ఇప్పుడు బతుకు మీద భయంతో బతుకుతోంది. ఒకప్పుడు కళకళలాడిన ఆ వీధి ఇప్పుడు శవాల వాసనతో, ఏడుపుల శబ్దంతో నిండిపోయింది. కర్మకాండ పొగ చల్లారకముందే పక్కింట్లో మరో శవం లేస్తోంది. మూడు రోజుల్లో ఐదుగురు, ఒకే ఇంట్లో నలుగురు పిట్టల్లా రాలిపోయారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పిల్లలు స్కూల్ కి వెళ్లాలన్నా, ఆటోలు, బస్సులు ఆ వీధికి రావాలన్నా భయంతో వణికిపోతున్నాయి. మురిగి కాలువలతో మున్సిపాలిటీ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నా కమిషనర్ పట్టించుకోవడం లేదు. అనారోగ్యంతో కొందరు, బతకలేక మరికొందరు చనిపోతున్నా నాయకులు కన్నెత్తి చూడటం లేదు. ఓట్లప్పుడు వచ్చిన నాయకులు, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఒక్కసారి కూడా రాలేదని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మా బస్తీకి కీడు వచ్చింది, బొడ్డురాయి వేయకపోతే ఊరే ఖాళీ అవుతుందని, మేము పేదోళ్లం మాకు స్తోమత లేదని ఎమ్మెల్యే గారే వచ్చి బొడ్డురాయి వేయించి ప్రాణాలు కాపాడాలని వేడుకుంటున్నారు.

....

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు, అక్టోబర్ 30, (ప్రజాజ్యోతి) : మణుగూరు చాపల మార్కెట్ లో ఇప్పుడు చేపల వాసన లేదు, శవాల వాసనే ఉంది. ఒకప్పుడు బేరాలతో గలగలలాడిన బస్తీ ఇప్పుడు శవాల దిబ్బగా మారింది. తల్లి కొడుకు కోసం ఏడుస్తుంటే, పక్కింట్లో తండ్రి కూతురు కోసం ఏడుస్తున్నాడు. ఏ ఇంట్లో చూసినా పసుపు తాడు తెగిన మహిళ, తల మీద గుడ్డ వేసుకున్న మగాడే కనిపిస్తున్నాడు. పుట్టిన పిల్లాడి నుండి పండు ముసలి వరకు ఎవరినీ వదలడం లేదు. “ఇది రోగమా, శాపమా, కీడా” అర్థం కావడం లేదని ముసలవ్వలు గుండెలు బాదుకుంటున్నారు. చావు భయంతో బస్తీ జనం రాత్రిళ్లు నిద్ర కూడా పోవడం లేదు. ఇలాగే ఉంటే బస్తీలో మనిషి అనే వాడు మిగలడని కన్నీటితో చెబుతున్నారు.

పిట్టల్లా రాలుతున్న ప్రాణాలు.. చాపల మార్కెట్ కు పట్టిన మాయదారి శాపం..!

చాపల మార్కెట్ బస్తీలో వరుస మరణాలు స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. మూడు రోజుల వ్యవధిలోనే ఐదుగురు చనిపోవడం, ఒకే ఇంట్లో నలుగురు ప్రాణాలు కోల్పోవడం చూసి జనం వణికిపోతున్నారు. ఇది సాధారణ మరణం కాదు, మా బస్తీకి ఏదో కీడు వచ్చిందని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లాడి నుండి పెద్ద వారి వరకు ఎవరినీ వదలకుండా మృత్యువు వెంటాడుతోందని చెబుతున్నారు. ఇంట్లో ఒకరి కర్మకాండ జరుగుతుండగానే పక్కింట్లో మరో చావు జరగడం ఆ బస్తీలో సాధారణమైపోయింది. అనారోగ్యంతో కొందరు, మానసిక ఒత్తిడితో మరికొందరు చనిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ వరుస చావుల వెనుక ఉన్న మర్మాన్ని ఎమ్మెల్యే, అధికారులు తెలుసుకోని తమ ప్రాంతానికి బొడ్డురాయి వేసేలా చూడాలని వేడుకొంటున్నారు. లేదంటే ఊరే ఖాళీ అవుతుందని భయంతో వణికిపోతున్నారు.

స్కూల్ కు వెళ్లాలంటే భయం.. బస్తీకి రావాలంటేనే వణుకుతున్న జనం..!

చాపల మార్కెట్ బస్తీ పేరు చెబితేనే జనం భయంతో వెనక్కి తగ్గుతున్నారు. పిల్లలను స్కూల్ కి పంపితే తిరిగి ఇంటికి వస్తారో లేదో అని తల్లిదండ్రులు కన్నీటితో ఎదురుచూస్తున్నారు. స్కూల్ బస్సు డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు కూడా ఆ వీధిలోకి రావాలంటే భయపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. పెద్దలు పనికి వెళితే తిరిగి వస్తామో లేదో తెలియని

పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఒకప్పుడు రద్దీగా ఉండే ఆ వీధి ఇప్పుడు నిర్మానుష్యంగా, శ్మశాన నిశ్శబ్దంతో ఉందని అంటున్నారు. రాత్రి పూట చిన్న శబ్దం వచ్చినా ఏ ఇంట్లో ఏమయ్యిందో అని జనం బయటకు వచ్చి చూస్తున్నారని, పిల్లలు రాత్రిళ్లు భయంతో నిద్ర పోవడం లేదని తల్లులు చెబుతున్నారు. ఈ భయం నుండి తమను కాపాడాలని, ఎమ్మెల్యే గారు వచ్చి ధైర్యం చెప్పాలని కోరుతున్నారు.

మురికి కాలువలను పట్టించుకోని మున్సిపాలిటీ..! కమిషనర్ అసలు ఉన్నారా..? అంటున్న జనం..!

చాపల మార్కెట్ బస్తీలో మున్సిపాలిటీ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా మురిగి కాలువలు తీయకపోవడం, చెత్త పేరుకుపోవడంతో దుర్వాసనతో నరకాన్ని తలపిస్తోందని అంటున్నారు. దోమలు, ఈగలతో రోగాలు ప్రబలి జనం అనారోగ్యం పాలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కమిషనర్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఒక్క అధికారి కూడా వచ్చి చూసిన పాపాన పోలేదని వాపోతున్నారు. అసలు కమిషనర్ ఉన్నారా, లేరా..? అని జనం ప్రశ్నిస్తున్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. మున్సిపాలిటీ శుభ్రం చేయకపోవడం వల్లే రోగాలు వచ్చి చనిపోతున్నారని బస్తీ వాసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బస్తిలో వెంటనే కాలువలు శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లాలని డిమాండ్ చేస్తున్నారు.

ఓట్లప్పుడు వస్తారు.. చావులప్పుడు రారు.. ఎమ్మెల్యే పాయం సార్ ఎక్కడున్నారు...

చాపల మార్కెట్ బస్తీలో ఇన్ని శవాలు లేస్తున్నా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఒక్కసారి కూడా వచ్చి చూడలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓట్ల కోసం వచ్చినప్పుడు మీ బస్తీని బంగారం చేస్తామని హామీలిచ్చిన నాయకులు ఇప్పుడు ఎక్కడికి పోయారని ప్రశ్నిస్తున్నారు. ఇంతమంది పిట్టల్లా రాలిపోతున్నా ఒక్క నాయకుడు కూడా వచ్చి పరామర్శించలేదని కన్నీటితో చెబుతున్నారు. మేము పేదోళ్లం, మాకు బొడ్డురాయి వేసే స్తోమత లేదు, ఎమ్మెల్యే గారే వచ్చి వేయించాలని వేడుకుంటున్నారు. తమ బాధను అర్థం చేసుకుని ప్రజాజ్యోతి పత్రిక తమ గోడును బయటకు తెచ్చిందని, పత్రిక విలేకరికి, పత్రిక ఎండీకి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి తమ బస్తీని సందర్శించి, బొడ్డురాయి వేయించి తమ ప్రాణాలు కాపాడాలని చేతులు జోడించి వేడుకుంటున్నారు. లేదంటే బస్తీలో ఒక్క మనిషి కూడా మిగలరని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యాసంగిలో వరికి విరామం.. అపరాల సాగుకు ప్రాధాన్యం!

- ఎల్‌నినో ప్రభావంతో మార్చి వరకు వర్షాలు కురిసే అవకాశం లేదు
- మండల వ్యవసాయ అధికారి ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి

దమ్మపేట,అక్టోబర్.30, (ప్రజాజ్యోతి): ఎల్‌నినో ప్రభావంతో వచ్చే యాసంగి సీజన్‌లో వర్షపాతం లోటు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం గండుగులపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే మార్చి నెల వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే పరిస్థితులు లేనందున యాసంగిలో వరి సాగును వాయిదా వేసుకోవాలని సూచించారు. తక్కువ నీటితో సాగు చేసుకునే అపరాలు, కూరగాయల పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. మొక్కజొన్న సాగుకు దూరంగా ఉండాలని రైతులకు సూచించారు. నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకుని పంటల ఎంపిక చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉన్నందున రైతులు నీటి వినియోగాన్ని తగ్గించి, తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వినోద్, విద్యుత్ శాఖ ఏఈ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో చదువుపై ఆసక్తి పెంచడమే లక్ష్యం.... ఎమ్మెల్యే జారే

- పట్వారిగూడెంలో ప్రీ ప్రైమరీ తరగతి గది ప్రారంభం.. - సరోజినాపురం పాఠశాలలో విద్యార్థుల చదువు తీరుపై ఎమ్మెల్యే ఆరాధ

దమ్మపేట,అక్టోబర్.30, (ప్రజాజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పలు పాఠశాలలను సందర్శించారు. మండలంలోని పట్వారిగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు చదువుపై ఆసక్తి కలిగించేలా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ తరగతి గదిని ఆయన ప్రారంభించారు. చిన్నారుల వయసుకు తగినట్లుగా విద్యను సులభంగా అర్థం చేసుకునేందుకు వివిధ రకాల ఆట వస్తువులు, ఆకర్షణీయమైన బోధనా సామగ్రిని ఏర్పాటు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఆటపాటల ద్వారా విద్యాబోధన చేయడం వల్ల చిన్నారుల్లో చదువుపై ఆసక్తి పెరగడంతో పాటు ఆలోచనా శక్తి, సృజనాత్మకత అభివృద్ధి చెందుతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఇలాంటి ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించడం అభినందనీయమన్నారు. చిన్నారులకు చిన్ననాటి నుంచే చదువుపై మక్కువ పెరిగేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం సరోజినాపురం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల చదువు తీరును పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి బోర్డుపై పదాలు రాయించడంతో పాటు పాఠ్యపుస్తకాల్లోని పాఠాలను చదివించారు. విద్యార్థులు చక్కగా చదువుతూ ప్రతిభ కనబరచడంతో వారిని అభినందించారు. వారికి నాణ్యమైన విద్యాబోధన అందిస్తూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీస్తున్న ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ప్రశంసించారు. ప్రతి విద్యార్థిపై నిరంతరం ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సైతం నాణ్యమైన విద్యతో భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపుతో పాటు విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కూరం అర్జున్ రావు, మండల విద్యాశాఖ అధికారి జగపతి రావు, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఉపసర్పంచ్ బొల్లికొండ నాగేశ్వరరావు, వాసం శ్రీనివాసరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డిమల్ల వెంకటేశ్వరరావు, కోటగిరి యుగేంద్రరావు, చెలికాని ప్రసాద్, వాసం వేణు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి నూతన బ్రిడ్జిపై లోడ్ పరీక్షలు

- వాహనాల రాకపోకలు పాత బ్రిడ్జిపైకి మళ్లింపు
- భద్రాచలం పట్టణ సీఐ సట్ల రాజు

భద్రాచలం, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి) భద్రాచలం వద్ద గోదావరి నదిపై నిర్మించిన నూతన హై లెవల్ బ్రిడ్జిపై నేటి నుండి అనగా వచ్చేనెల నవంబర్ 07 తేదీ వరకు లోడ్ టెస్టింగ్ నిర్వహించనున్నట్లు భద్రాచలం పట్టణ సీఐ సట్ల రాజు ప్రకటన ద్వారా తెలిపారు. ఈ నేపథ్యంలో, ఈ కాలంలో నూతన బ్రిడ్జిపై వాహనాల రాకపోకలకు అనుమతి ఉండదు అని, కావున, పైన తెలిపిన తేదీలలో నూతన బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగించే అన్ని వాహనాలను పాత గోదావరి బ్రిడ్జి మీదుగా మళ్లించడం జరుగుతుంది అని ఆయన తెలిపారు. వాహనదారులు పోలీసు వారి సూచనలను పాటించాలని, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు శాఖకు సహకరించాలని భద్రాచలం సీఐ సట్ల రాజు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొత్తగూడెం ఐ డి ఓ సి లో ఏసీబీ విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

- ఏ ప్రభుత్వ ఉద్యోగి అయిన లంచం అడిగితే ఏసీబీ దృష్టికి తీసుకురావాలి: ఏసీబీ డీఎస్పీ వై రమేష్

కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 30 ,(ప్రజాజ్యోతి) : జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని ఐ డి ఓ సి సమావేశ మందిరంలో ఏసీబీ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డిఎం అండ్ హెచ్ ఓ , జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు అవినీతి నిరోధక పై ఏసీబీ డిఎస్పి వై రమేష్ అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1 వరకు నిర్వహిస్తున్న ఈ విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ఇతివృత్తం ,సమృద్ధి కోసం ,సత్యనిష్ట, ప్రబులిటీ ,ఫర్ ప్రాస్పరిటి సందర్భంగా అవినీతి నిర్మూలన నిజాయితీ, పారదర్శకత, జవాబుదారితనం, అదేవిధంగా నైతిక విలువల ప్రాధాన్యంపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు, ప్రభుత్వ విధుల నిర్వహణలో సత్యనిష్టను పాటిస్తూ అవినీతికి తావు లేకుండా ప్రజలకు పారదర్శకమైన సమర్థవంతమైన సేవలను అందించాలని సూచించారు , ఏ ప్రభుత్వ అధికారి అయిన లంచం డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు, అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ఉద్యోగులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు, అనంతరం ప్రభుత్వ ఉద్యోగులచే ప్రజల నుండి లంచం డిమాండ్ చేయమని ప్రతిజ్ఞ చేయించారు, ఈ కార్యక్రమంలో ఎస్పై శేఖర్ , డి ఎం అండ్ హెచ్ ఓ తుకారం రాథోడ్ ,పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగ నియమకాలలో ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు 75% రిజర్వేషన్ కల్పించాలి

గతంలో జీవో 3 రద్దు చేశారు - జీవో నెంబర్ 57 అమలు చేయట్లేదు - ఐటీడీఏ పరిధిలోని మొబైల్ కోర్టు తీసివేశారు
- గిరిజనులను అణిచివేయడంలో కుట్రలో భాగంగానే జరుగుతుందని లావుడియా ప్రసాద్ నాయక్ ఆరోపించారు

లక్ష్మీదేవి పల్లి ,30 అక్టోబర్ ,ప్రజా జ్యోతి: తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన పోలీస్ ఉద్యోగ నోటిఫికేషన్ లో ఏజెన్సీ ఏరియాలో గిరిజనులకు 75% రిజర్వేషన్ కల్పించాలని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్ డిమాండ్ చేశారు తెలంగాణ ప్రభుత్వం రిలీజ్ చేసిన పోలీసు ఉద్యోగ నోటిఫికేషన్ లో ఏజెన్సీ ఏరియా రిజర్వేషన్ కి సంబంధించి ఎటువంటి రిజర్వేషన్ విషయం ప్రస్తావించలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, రానున్న నల్గొండ -వరంగల్- ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్నటువంటి గ్రాడ్యుయేట్స్ లతో అడ్డుకుంటామని తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాతనే ఏజెన్సీ ఏరియాలో ఓటర్లను అడగాలని లేకపోతే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు గతంలో జీవో 3 రద్దు చేశారు మరియు జీవో నెంబర్ 57 అమలు చేయట్లేదు ఐటిడిఏ పరిధిలో ఉన్నటువంటి మొబైల్ కోర్టును ఐటీడీఏ పరిధి నుంచి తీసేయడం చేశారు ఇవన్నీ గిరిజనుల పట్ల రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా అనుచి వేయడంలో కుట్రలో భాగంగానే జరుగు తోందని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవేదన వ్యక్తం చేశారు . ఈ కార్యక్రమంలో సేవాలాల్ బంజారా సంఘం విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అనిల్ నాయక్ ,గణేష్ మల్బార్ ,సురేష్ ,చందు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జోనల్ స్థాయి ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీలు

వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖోలో పాల్వంచకు ప్రథమ స్థానం

ములకలపల్లి, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): మండలంలోని కమలాపురం ఆశ్రమ పాఠశాలలో మూడు మండలాల పరిధిలో నిర్వహించిన జోనల్ స్థాయి ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో పాల్వంచ జట్లు సత్తాచాటి అగ్రస్థానంలో నిలిచాయి. అండర్-14, అండర్-17 బాలుర విభాగాల్లో నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో పోటీల్లో పాల్వంచ జట్లు ప్రథమ స్థానాలను కైవసం చేసుకోగా, బూర్గంపాడు జట్లు ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందించేందుకు ఆర్థిక సహకారం అందించిన గాడి తిరుపతిరెడ్డికి మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతోపాటు వారికి శిక్షణ అందించిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాహితి ఫ్రెషర్స్ వేడుకలు

ఇల్లందు, అక్టోబర్ 30 (ప్రజా జ్యోతి) : పట్టణంలోని సాహితి జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, స్థానిక కౌన్సిలర్ సోనీ బాయి కోరి, కళాశాల డైరెక్టర్లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ విద్యార్థులు ఈ వయస్సులోనే తమ లక్ష్యాన్ని ఎంచుకోవాలని, తల్లిదండ్రులు, గురువులు ఏది చెప్పిన మీ మంచి కోసమే అని ఆచరిస్తూ, మంచి మార్గంవైపు నడిచి విజయాలు సాధించి, తల్లిదండ్రులు, గురువులు గర్వించే విధంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు పదవతరగతి తర్వాత మీరు ఏ గ్రూపు తీసుకుంటే బాగుంటుందో ఎలా నిర్ణయించుకుంటారో అదే విధంగా ఏ రంగంలోనైనా మీరు ఉన్నతంగా ఎదగాలని సూచించారు. విద్యార్థులు సమాజంలో మంచి స్థాయిలో ఉండాలంటే ముఖ్యంగా తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివితే, వారు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. 2026 మార్చిలో ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు చైర్ పర్సన్ మెమెంటోలను ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పులిగళ్ళ మాధవరావు, కళాశాల డైరెక్టర్లు మాదినేని శ్రీనివాస్, యంసి నాగిరెడ్డి, ప్రిన్సిపాల్ గుజ్జర్లపూడి రాంబాబు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం

ములకలపల్లి, అక్టోబర్ 30 (ప్రజాజ్యోతి): ప్రతి విద్యార్థి బాలల హక్కులు, వాటి పరిరక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పారా లీగల్ వాలంటీర్ కీసరి వీరభద్రం సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ తమ హక్కుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ములకలపల్లి జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాలల హక్కులు, వాటి పరిరక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. బాలలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. ఉచిత న్యాయ సహాయం కోసం లీగల్ హెల్ప్‌లైన్ 15100కు ఫోన్ చేయవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం బౌసింగ్, ఉపాధ్యాయులు కవిత, మాధవి, చంద్రకళ, పద్మారాణి, కేశవ, దశరథి తదితరులు పాల్గొన్నారు.

నవ వధూవరులను ఆశీర్వదించిన ఎస్.కె షబీర్ పాషా

లక్ష్మీదేవి పల్లి, 30 అక్టోబర్ , ప్రజా జ్యోతి: లక్ష్మీదేవి పల్లి మండల కేంద్రంలోని సీతారాంపురం గ్రామపంచాయతీ గోరియ తండా గ్రామం నందు సిపిఐ పార్టీ సీనియర్ నాయకుడు బానోత్ నెహ్రూ గారి కుమారుడు బానోత్ శశి కుమార్ వివాహానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి నవ వధూవరులను ఆశీం- ్వదించి అయ్యూరోగాలతో సిరిసంపదలతో ఆ భగవంతుని ఆశీర్వాదం ఎప్పుడు ఉండాలని తెలియజేసి, నూతన వధూవరులను శుభాకాంక్షలు తెలియజేసిన సిపిఐ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సబీర్ పాషా ,మేయర్ గణేష్ ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు ,లక్ష్మీదేవిపల్లి మండల కార్యదర్శి డిటి లక్ష్మీపతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవి ,ఉమ్మడి సీతారాంపురం పంచాయతీ బాధ్యులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బి రహదారి పక్కనే గ్యాస్ అమ్మకాల హవా...!

అధిక ధరలకు గ్యాస్ సిలిండర్లు
హోటళ్లు, నూడుల్స్ సెంటర్లు, రెస్టారెంట్లకు అనునిత్యం సరఫరా!
నిబంధనలకు నీళ్లు
సంబంధిత అధికారుల పర్యవేక్షణ శూన్యం

అశ్వాపురం, అక్టోబర్, 30,ప్రజాజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో అభిరామ్ గ్యాస్ విక్రయాల వ్యవహారంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రహదారి పక్కనే కార్యాలయం ఏర్పాటు చేసి గ్యాస్ సిలిండర్ల విక్రయాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, విక్రయాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారమే వ్యాపారం సాగుతోందా? అన్న అంశాలపై స్పష్టత అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

హోటళ్లు, నూడుల్స్ సెంటర్లు, రెస్టారెంట్లకు గ్యాస్ సరఫరా!

మండలంలోని హోటళ్లు, నూడుల్స్ సెంటర్లు, రెస్టారెంట్లలో వంట అవసరాలకు గ్యాస్ సిలిండర్లు వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే గ్యాస్ సిలిండర్ల సరఫరా, విక్రయ ధరలు, నిల్వలు, రవాణా, భద్రతా ప్రమాణాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అధిక ధరలకు సిలిండర్లు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉంటే, బిల్లులు, ధరల పట్టికలు, సరఫరా వివరాలను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలి.

అధిక ధరలకు విక్రయాలపై విచారణ ఎప్పుడు?

గ్యాస్ సిలిండర్ల ధరలు, సరఫరా విధానాలకు సంబంధించి నిబంధనలు ఉన్నప్పటికీ, వాటి అమలును పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత శాఖలపై ఉంది. నిర్ణీత ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తే అధికారులు విచారణ చేపట్టాలి. వ్యాపారానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, అక్రమాలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.

రహదారి పక్కన కార్యాలయం.. భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా?

రహదారి పక్కన గ్యాస్ విక్రయ కార్యాలయం నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం నేపథ్యంలో, అక్కడ సిలిండర్లను నిల్వ చేస్తున్నారా? నిల్వ చేస్తుంటే అనుమతులు ఉన్నాయా? అగ్నిప్రమాద నివారణ ఏర్పాట్లు ఉన్నాయా? రవాణా, నిల్వకు సంబంధించిన భద్రతా నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలను సంబంధిత అధికారులు పరిశీలించాలి. కార్యాలయం ఉండటం ఒక్కటే నిబంధనల ఉల్లంఘనకు ఆధారం కాదు. అయితే, ప్రజల భద్రతకు సంబంధించిన అంశాలను నిర్లక్ష్యం చేయకూడదు.

1/70 చట్టం వర్తిస్తుందా?

అశ్వాపురం ఏజెన్సీ ప్రాంతంలో వ్యాపార కార్యకలాపాలు జరుగుతున్న నేపథ్యంలో 1/70 చట్టం వర్తింపుపైనా స్పష్టత అవసరం. అయితే, గ్యాస్ సిలిండర్ల విక్రయాలు జరుగుతున్నాయనే కారణంతోనే ఆ చట్టం ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారించలేం. కార్యాలయం ఉన్న భూమి యాజమాన్యం, భూమి బదిలీ లేదా లీజు వివరాలు, సంబంధిత లావాదేవీల స్వభావాన్ని పరిశీలించిన తర్వాతే చట్టపరమైన నిర్ణయం తీసుకోవాలి.

అధికారులు స్పందించి వాస్తవాలు వెల్లడించాలి!

గ్యాస్ విక్రయాలకు సంబంధించిన ఆరోపణలపై పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ శాఖ, సంబంధిత గ్యాస్ సరఫరా సంస్థలు, అవసరమైన చోట అగ్నిమాపక శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలి. ధరల విషయంలో అక్రమాలు ఉన్నాయా? సిలిండర్ల నిల్వ, సరఫరాకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? 1/70 చట్టం వర్తించే అంశాల్లో ఏవైనా ఉల్లంఘనలు జరిగాయా? అనే ప్రశ్నలకు సమాధానాలు వెలుగులోకి తేవాలి. ప్రజల భద్రత, వినియోగదారుల హక్కులు కాపాడటం అధికారుల బాధ్యత. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ఆరోపణల్లో వాస్తవాలు లేకపోతే వాటిపై స్పష్టత ఇవ్వాలి. సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

చర్ల, అక్టోబర్ 30: (ప్రజా జ్యోతి):
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మలిదశ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చర్ల మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం చర్ల మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ 2010 నుంచి 2014 జూన్ 2 వరకు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చర్ల మండలంలో తెలంగాణ జేఏసీని ఏర్పాటు చేసుకుని ఉద్యమంలో పాల్గొన్నామని తెలిపారు. రాష్ట్ర సాధన కోసం అనేక పోరాటాలు, ఆందోళనల్లో పాల్గొన్న ఉద్యమకారులకు రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్లు గడిచినా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక, సామాజిక సహకారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో కొందరు ఆత్మహత్యలు చేసుకోగా, మరికొందరు అంగవైకల్యానికి గురయ్యారని, ఇంకొందరు అనేక ఇబ్బందులతో జీవితాలను కొనసాగిస్తున్నారని ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలని కోరారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేయాల్సిన ఏడు ప్రధాన డిమాండ్లను వినతిపత్రంలో ప్రస్తావించారు. ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలంతో పాటు ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక సహాయం అందించాలని, నెలకు రూ. 25 వేల పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఉద్యమకారులు, వారి కుటుంబ సభ్యులకు తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించాలని, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉద్యమకారుల పిల్లలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు ప్రత్యేక సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తెలంగాణ ఉద్యమకారుల పూర్తి వివరాలను సేకరించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, అర్హులైన ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌ను కోరారు. ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేసి వారి కుటుంబాలకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారుఈ కార్యక్రమంలో వెంకటరమణ ,తరుణ్ రెడ్డి, వీర్రాజు, జయరామిరెడ్డి ,వై మురళి, శ్రీనివాసరావు, పాహిం ,పొడెం నరసింహమూర్తి, శివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో.. రక్తదాన యజ్ఞం!

- పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం
- దమ్మపేటలో 62 యూనిట్ల రక్తం సేకరణ.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న యువత

దమ్మపేట,అక్టోబర్. 30, (ప్రజాజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా దమ్మపేట ఎస్ ఐ రాజేష్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు అశ్వారావుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు రెడ్డి పర్యవేక్షణలో దమ్మపేట పోలీస్‌స్టేషన్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దమ్మపేట, అశ్వారావుపేట మండలాలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. ఈ శిబిరంలో మొత్తం 62 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దమ్మపేట మండల మేజిస్ట్రేట్ భవాని, అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ, గైనకాలజిస్ట్ మౌనిక హాజరయ్యారు. రక్తదానం చేసిన యువకులను అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ప్రాణాలు కోల్పోయే పరిస్థితులను నివారించేందుకు రక్తదానం ఎంతో అవసరమని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పోలీసుల భాగస్వామ్యం

అశ్వారావుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు రెడ్డి మాట్లాడుతూ పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొని సామాజిక బాధ్యతను చాటుకున్నారని, పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం ద్వారా సేకరించిన 62 యూనిట్ల రక్తం అవసరమైన వారికి ఉపయోగపడనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, దమ్మపేట, అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్ల సిబ్బంది, యువకులు, రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తుకు చెక్.. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురికి జరిమానా!



దమ్మపేట,అక్టోబర్. 30, (ప్రజాజ్యోతి): దమ్మపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగురికి దమ్మపేట మేజిస్ట్రేట్ భవాని జరిమానా విధించా రు. ఒక్కొక్కరికి రూ. 500 చొప్పున మొత్తం రూ. 2,000 జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే జారే సందడి నూతన వధూవరులకు ఆశీస్సులు

దమ్మపేట,అక్టోబర్. 30, (ప్రజాజ్యోతి): మండలంలోని సరోజినాపురం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి రవి -- రమాదేవి దంపతుల కుమార్తె స్వాతి, సంతోష్‌ల నిశ్చితార్థ వేడుకలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొని కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం నాగుపల్లి గ్రామానికి చెందిన పొన్నగంటి యుగంధర్ -- శ్రీదేవి దంపతుల కుమారుడు షణ్ముఖ రాణా ప్రతాప్, లిఖితల వివాహ వేడుక సత్తుపల్లిలో జరగగా హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పీసీసీ సభ్యులు మద్దిశెట్టి సత్యప్రసాద్, మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పొదిలి జ్యోతి, నాగుపల్లి సర్పంచ్ ఇస్లావత్ శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ కుంపటి వేణు, మారగాని నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో రక్షకభటుల రక్తదానం..!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు.

అక్టోబర్ 30, ప్రజాజ్యోతి...

ఖాకీ అంటే కేవలం కఠినత్వం కాదు, ఖాకీ వెనుక కరుణ కూడా ఉంటుందని మణుగూరు పోలీసులు మరోసారి నిరూపించారు. అమరవీరుల వారోత్సవాల సందర్భంగా తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుల స్ఫూర్తితో మణుగూరు పట్టణంలోని కిన్నెర కళ్యాణమండపంలో శుక్రవారం భారీ రక్తదాన శిబిరాన్ని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరానికి సబ్ డివిజన్ డీఎస్పీ రవీందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై యువతలో ఉత్సాహం నింపుతూ రక్తదానం యొక్క ఆవశ్యకతను వివరించారు. పోలీసుల పిలుపు మేరకు మణుగూరు పరిసర ప్రాంతాలకు చెందిన వందమంది పైగా యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం విశేషం. నేరాలను అరికట్టడమే కాదు అవసరమైన సమయంలో ప్రాణదాతలుగా నిలవడం కూడా తమ బాధ్యత అని డీఎస్పీ ఈ సందర్భంగా వివరించారు. అమరవీరులు దేశం కోసం ప్రాణాలు ఇస్తే, మనం రక్తదానం చేసి మరొకరి ప్రాణం కాపాడాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన యువతకు పోలీస్ శాఖ తరపున తినుబండారాలు పంపిణీ చేసి అభినందించారు. ఈ శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన యువతకు, మరియు ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి యువతను సమీకరించడంలో కీలక పాత్ర పోషించిన మీడియాకు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు సీఐ నాగబాబు, ఏడుల్లా బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, అశ్వాపురం సీఐ ఎల్లయ్య, ఎస్సైలు నగేష్ కుమార్, రావుఫ్ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో కాంగ్రెస్ నూతన కార్యాలయం కోసం స్థల పరిశీలన

భద్రాద్రి కొత్తగూడెం, 30 అక్టోబర్ ,ప్రజా జ్యోతి: కొత్తగూడెం పట్టణంలోని రైటర్ బస్తి లో కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా కార్యాలయ నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలాన్ని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు . కార్యకర్తలు ఎవరు ఆ ధైర్య పడవద్దు అని అందరికీ అందుబాటులో ఉండే విధంగా త్వరలో నూతన కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో అందరికీ పథకాల అందే విధంగా, కొత్తగూడెం నియోజకవర్గం లో పథకాలు అందరికి అదే విధంగా కమిటీలు ఏర్పాటు చేసి కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందు వరుసలో ఉంచడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ అడగగానే పార్టీ కార్యాలయ కోసం స్థలం కేటాయించడం సంతోషకరమని ఆనందం వ్యక్తం చేశారు . ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ,భద్రాద్రి కొత్తగూడెం డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ,మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు ,అల్లా మురళి ,జేవీఎస్ చౌదరి ముఖ్య నాయకులు, కార్యకర్తలు ,తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో ఐరెన్ షాపుల దందా..!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు. అక్టోబర్ 30, ప్రజాజ్యోతి...

మణుగూరులో ఇనుము అమ్మకం.. చీకట్లో జరుగుతున్న వ్యాపారమా..? కాంటా ఏది..? బిల్లు ఏది..? లైసెన్స్ ఏది..? ఏది అడిగినా సమాధానం లేదని కొన్ని దుకాణాల ద్వారా తెలుస్తోంది. కోట్లలో సరుకు తిరుగుతోంది.. కానీ కాగితాలపై మాత్రం లెక్కలే లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బరువులో తేడా, నాణ్యతలో మోసం, బిల్లులో తిరకాసు.. ఇలా మూడు చోట్లా వినియోగదారుడు దెబ్బతింటున్నాడనే చర్చ మణుగూరులో జరుగుతోంది. అనుమతులు లేని గోడౌన్లలోనే భారీ నిల్వలు ఉంటున్నాయా..? అనే సందేహాలు కూడా ఉన్నాయి. అందుకే ఈసారి కాగితాల తనిఖీ కాదు.. క్షేత్రస్థాయిలో సంయుక్త తనిఖీ జరగాలని స్థానికులు కోరుతున్నారు.

బ్రాండ్ పేరుతో నకిలీ ఇనుమా..? ఐఎస్ఐ స్టాంప్ పై సందేహాలు.. నాణ్యత పరీక్షలు ఎక్కడ..?

పేరున్న కంపెనీ స్టీల్ అని కొందరు వ్యాపారస్థులు చెప్పి, స్టాంప్ వేసి అమ్ముతున్న ఇనుము నిజంగా ఆ కంపెనీదేనా..? అనే అనుమానం మణుగూరులో గుప్పుమంటోంది. ఐఎస్ఐ మార్క్, గ్రేడ్ నంబర్, బ్యాచ్ నంబర్ లేకుండానే రాడ్లు విక్రయిస్తున్నారనే ఆరోపణ నిండుగా ఉంది. నాణ్యత తక్కువ ఇనుము వాడితే పిల్లర్లు, స్లాబ్ లు బలహీనపడి, ఇళ్లు కూలే ప్రమాదం ఉందని ఇంజనీర్లు హెచ్చరిస్తున్నారు. కొనుగోలుదారునికి మిల్లు టెస్ట్ సర్టిఫికేట్, బిల్లుపై గ్రేడ్ వివరాలు ఇవ్వడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అధికారులు మార్కెట్ నుంచి నమూనాలు సేకరించి ల్యాబ్ కు పంపి, నివేదికను బహిరంగపరచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సిమెంట్ బస్తాలపై తేదీల మాయాజాలం.. కాలం చెల్లిన సరుకుతో ఇళ్ల నిర్మాణమా..?

సిమెంట్ కు కేవలం 90 రోజులే జీవితకాలం ఉంటుందని తెలిసినా, మణుగూరులో పాత బస్తాలను తిరిగి అమ్ముతున్నారనే ప్రచారం జోరుగా జరుగుతోంది. గోడౌన్లలో మూలన ఉన్న బస్తాలపై కొత్త స్లిప్పులు అంటించి, తేదీ మార్చి అమ్మే తీరుపై అనుమానాలు కూడా ఉన్నాయి. గడువు దాటిన సిమెంట్ తో కట్టిన ఇళ్లలో పగుళ్లు, సీలింగ్ లీకేజీలు త్వరగా వస్తాయని కొందరు మేస్త్రీలు చెబుతున్నారు. వినియోగదారుడు బస్తాపై తయారీ తేదీ, వారం సంఖ్య, ఫ్యాక్టరీ కోడ్ చూడకుండా కొంటే నష్టపోయే అవకాశం ఉందని చెబుతున్నారు. కల్తీ, కాలం చెల్లిన సిమెంట్ ను గుర్తించేందుకు లీగల్ మెట్రాలజీ, కన్స్యూమర్ ఫోరం అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించాలని స్థానికుల నుంచి డిమాండ్ వినిపిస్తోంది.

అప్పుకు సరుకు తెచ్చి, క్యాష్ కి అమ్మకం..! లెక్కల్లో తేడాతో కోట్లకు కోట్లు.. ఐటీ శాఖ ఉందా..?

మణుగూరు మార్కెట్ లో కొన్ని ఐరన్ దుకాణాల్లో రోజూ లక్షల్లో క్యాష్ చేతులు మారుతున్నా, పక్కా లెక్కలు మాత్రం కనిపించడం లేదనే చర్చ జరుగుతోంది. కంపెనీల నుంచి 30 రోజుల క్రెడిట్ పై సరుకు తెచ్చుకుని, కస్టమర్లకు మాత్రం నగదుకే అమ్మడం వల్ల పెద్ద మొత్తంలో నగదు నిల్వ ఉంటుందనే ఆరోపణ సంవృద్ధిగా ఉందనే వినిపిస్తోంది. ఈ నగదు బ్యాంకుల్లో జమ కాకుండా, ఇతర వ్యాపారాల్లోకి మళ్లుతోందా..? అనే కోణంలో పరిశీలించాల్సి అవసరం ఎంతైనా ఉంది. ఆదాయానికి మించి ఆస్తులు, గోడౌన్లు, వాహనాలు ఎలా వచ్చాయనే దానిపై ఆదాయపు పన్ను శాఖ దృష్టి పెట్టాలని మేధావులు మాట్లాడటం చర్చనీయశంగా మారింది. బ్యాంకు లావాదేవీలు, జీఎస్టీ రిటర్న్ లు, విద్యుత్ బిల్లులను పోల్చి చూస్తే అసలు లెక్క బయటపడుతుందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మొద్దు నిద్ర వీడి ప్రతి దుకాణాన్ని తనిఖీ చేయాలని స్థానిక ప్రజానీకం కోరుతున్నారు.

ఆటస్థలం ఏదీ..? అభివృద్ధి ఎక్కడ..?

అశ్వాపురంలో క్రీడామైదానం కరువు..!
ఆటలు ఆడేందుకు మైదానం లేదు!
పిల్లలు, మహిళలు, వృద్ధుల ఇబ్బందులు
అధికారులకు కనిపించడం లేదా?
క్రీడలకు ప్రాధాన్యమేది? అధికారుల నిర్లక్ష్యంపై
:సీనియర్ క్రీడాకారుడు గద్దల రామకృష్ణ

అశ్వాపురం,అక్టోబర్ 30,ప్రజాజ్యోతి

మండల కేంద్రంలో పిల్లలు ఆటలు ఆడుకోవడానికి, యువత క్రీడా సాధన చేయడానికి, మహిళలు, వృద్ధులు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసేందుకు అనువైన క్రీడామైదానం లేకపోవడం విచారకరం. అభివృద్ధి గురించి మాట్లాడుతున్న అధికారులు ప్రజల ఆరోగ్యానికి, యువత భవిష్యత్తుకు అవసరమైన కనీస సౌకర్యాలను ఎందుకు పట్టించుకోవడం లేదనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు క్రీడలతో ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రచారం చేస్తున్న ప్రభుత్వాలు.. మరోవైపు క్రీడలు ఆడేందుకు స్థలం కల్పించడంలో ఎందుకు వెనుకబడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అభివృద్ధి మాటలు సరే.. ప్రజలకు సౌకర్యాలేవి?

అశ్వాపురం మండలంలో క్రీడామైదానం సమస్య నేటికీ పరిష్కారానికి నోచుకోకపోవడం స్థానికుల ఆవేదనకు కారణమవుతోంది. పిల్లలు స్వేచ్ఛగా ఆడుకోవాలన్నా, యువత క్రీడల్లో రాణించాలన్నా, వృద్ధులు ఆరోగ్యం కోసం నడవాలన్నా సరైన స్థలం అవసరం. కానీ అలాంటి వసతులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలను గుర్తించి కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై లేదా? మండల అభివృద్ధి ప్రణాళికల్లో క్రీడామైదానానికి ఎందుకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదు? ప్రజల అవసరాలను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అధికారుల దృష్టికి ప్రజల సమస్యలు రావా?

మండలంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు క్రీడామైదానం అంశంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పిల్లలు, యువత, మహిళలు, వృద్ధులకు ఉపయోగపడే స్థలం లేకపోవడం చిన్న సమస్యగా భావించడానికి వీల్లేదు. ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనలో జాప్యం జరిగితే దాని ప్రభావం నేరుగా వారి ఆరోగ్యంపై, జీవన ప్రమాణాలపై పడుతుంది. క్రీడామైదానం కోసం ప్రత్యేక స్థలాన్ని గుర్తించడం, అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించడం, అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయడం వంటి చర్యలపై అధికారులు దృష్టి పెట్టాలి. ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటో ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం కూడా ఉంది.

ఉన్న మైదానాన్ని అభివృద్ధి చేయలేరా?

ప్రభుత్వ కళాశాల సమీపంలో ఉన్న మైదానం పూర్తిస్థాయిలో వినియోగానికి అనుకూలంగా లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అక్కడి పరిస్థితులను అధికారులు పరిశీలించి, అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలి. సాధ్యమైనచోట వాకింగ్ ట్రాక్, క్రీడా ప్రాంగణం, పిల్లలు ఆడుకునేందుకు అనువైన ప్రదేశం, కూర్చునేందుకు బెంచీలు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలి. క్రీడామైదానం ఏర్పాటు చేయడం అంటే కేవలం ఖాళీ స్థలాన్ని చూపించడం కాదు. ప్రజలు సురక్షితంగా ఉపయోగించుకునేలా దానిని అభివృద్ధి చేయడం కూడా అంతే ముఖ్యం. ఇందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలి.

యువత భవిష్యత్తుపై నిర్లక్ష్యం ఎందుకు?

క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల పెంపొందిస్తాయి. పిల్లల శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయి. వృద్ధులకు నడక ఆరోగ్య పరిరక్షణలో కీలకంగా ఉంటుంది. మహిళలకు కూడా వ్యాయామం చేసేందుకు అనువైన స్థలం అవసరం. ఇన్ని ప్రయోజనాలు ఉన్నప్పటికీ, క్రీడలకు అవసరమైన ప్రాంగణం అందుబాటులో లేకపోవడం మండల అభివృద్ధిలో లోటుగానే భావించాలి. క్రీడామైదానం లేకపోవడంతో యువతకు క్రీడా సాధన చేసే అవకాశాలు పరిమితమవుతున్నాయి. చిన్నారులకు ఆటలాడే స్వేచ్ఛ తగ్గుతోంది. ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు అనువైన వాతావరణం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిపై ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

క్రీడామైదానం ఏర్పాటు చేయాలి: సీనియర్ క్రీడాకారుడు రామకృష్ణ

సీనియర్ క్రీడాకారుడు రామకృష్ణ మాట్లాడుతూ, అశ్వాపురం మండలంలో వాకింగ్ చేయడానికి, ఆటలు ఆడుకోవడానికి అనువైన స్థలం లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడలు మనిషి మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఎంతగానో ఉపయోగపడతాయని, అలాంటి క్రీడలకు అవసరమైన మైదానం లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి మండలంలో క్రీడామైదానం ఏర్పాటు చేయాలని కోరారు. పిల్లలు, యువత, మహిళలు, వృద్ధులకు ఉపయోగపడేలా మైదానాన్ని అభివృద్ధి చేసి, అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఇప్పటికైనా అధికారులు మేల్కొంటారా?

అశ్వాపురం మండలంలో క్రీడామైదానం ఏర్పాటు కోసం అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించి, అవసరమైన నిధులు సమకూర్చి, పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో ప్రజలకు స్పష్టత ఇవ్వాలి. క్రీడామైదానం సమస్యను పట్టించుకోకుండా వదిలేస్తే ప్రజల ఆరోగ్యం, యువత భవిష్యత్తుకు సంబంధించిన అవసరాలు నిర్లక్ష్యానికి గురైనట్లే. అభివృద్ధి అంటే కేవలం భవనాలు, రహదారులు నిర్మించడమే కాదు.. ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించడం కూడా. అశ్వాపురంలో క్రీడామైదానం సమస్యకు అధికారులు ఎప్పుడు పరిష్కారం చూపుతారో వేచి చూడాల్సిందే!